క్లుప్తంగా

వైభవంగా దుర్గామాత ఉత్సవాలు



సామూహిక గౌరీ పూజలో గ్రామస్తులు

మర్పల్లి: మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో శనివారం దుర్గామాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణ, గోపూజ చేపట్టారు. గౌరీపూజలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు సురేశ్, అశోక్ దంపతులతో పాటు పలువురు దంపతులు వేదపండితుల ప్రవచనాలతో సామూహిక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు జగదీశ్వర్, రాకేష్, రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు పంపిణీ చేస్తున్న శేఖర్

దుద్యాల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నాన్య నాయక్ తండాకు చెందిన అంకితకు మంజూరైన రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రైవేట్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య చికిత్సకోసం ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, రాహుల్, శల్య నాయక్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

బంట్వారం: ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలని టీడీపీ వికారాబాద్ నియోజవర్గం ఇన్‌చార్జి రొంపల్లి నర్సింలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన పరిపాలనాదక్షుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయన కొనియాడారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ఏంఈఓ నర్సింగ్‌రావు



ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న నర్సింగ్‌రావు

తాండూరు రూరల్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఏంఈఓ నర్సింగ్ రావు పేర్కొన్నారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏంఈఓ మాట్లాడుతూ..జూన్ 12వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభమౌతాయన్నారు. పాఠశాలలకు వచ్చిన మొదటిరోజు విద్యార్థులకు పాఠ్యాపుస్తకాలు, యూనిఫాం అందజేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, పౌష్టికాహారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగెరి మల్లేశ్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల సోమేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని చిలుకూరు బాలాజీ శివాలయ వేదపండితుడు సురేష్‌స్వామి ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో సంగెరి మల్లేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, వైసీపీ జిల్లా నాయకుడు ముదిగొండ రాజయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనం, అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జంగంయాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పత్రాల పంపిణీ

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగులపల్లి రాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 41 మంది లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, నరేశ్, శ్రీకాంత్‌రెడ్డి, భిక్షపతి, వెంకట్‌రెడ్డి, గన్నేపాగ నర్సింగ్‌రావు, నాగేశ్వర్ రావు, ఆంజనేయులుగౌడ్, నయీముద్దీన్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు!

- కానరాని హెచ్చరిక బోర్డులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



నూరుల్లాపూర్ వాగు వద్ద కుంగిన కల్వర్టు

బంట్వారం: మండలంలో ఎప్పుడో కట్టినవి పాతబడి, రోజులు గడిచి, ఏళ్ల తరపబడి అదే కల్వర్టుపై భారీ వాహనాలు తిగడంతో పగుళ్లు ఏర్పడుతున్నాయి. నాణ్యత లోపించి, భారీ వర్షాలకు కూలి, కుంగడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. వాటి మీద నుంచి ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే. వీటిపై నుంచి వాహనాలు వెళ్లాలంటే ఎప్పుడు ఏమౌతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా తయారవుతున్నాయి. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం ఈ విషయంలో తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. బంట్వారం–రొంపల్లి రోడ్డులో కల్వర్టులు తాత్కాలికంగా కూలి ఐదేళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. వాటికి కనీసం మరమ్మతులు చేయించేవారు లేరు. కొత్తగా నిర్మాణపనులు చేపట్టడం లేదు. రాబోయేది వానాకాలం. భారీ వర్షాలకు, వరదకు మెత్తబడి పూర్తిగా కూలిపోయి జరగరానిది ఏదైనా సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు గుంతలు పడిన రోడ్లు..ఆపై అక్కడక్కడ కూలిన కల్వర్టులు ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కోట్‌పల్లి మండలంలోని ఎన్కెపల్లి రోడ్డులో మూల మలుపు వద్ద కల్వర్టు సమీపంలో పెద్ద గుంత ఏర్పడింది. దాన్ని ఎవరూ పట్టించుకోరు. అక్కడ ఆదమరిచి అతివేగంగా వెళితే గుంతలో పడి ప్రాణాలు కోల్పోవలిసిందే. ఇప్పటికే పలువురు గాయపడ్డారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళలో అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. కూలిన కల్వర్టుల పైనుంచి వాహనాలు వెళితే లోడింగ్ లారీలు, బస్సులు దిగబడే అవకాశం ఉంది. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టడం లేదు. దీంతో వాహనదారులు అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోతేగాని స్పందించరా? అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్తగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

> **మరమ్మతులు చేయించాలి**
>
> 
>
> కూలిన కల్వర్టుల దగ్గర తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రొంపల్లి, నూరుల్లాపూర్, ఎన్కెపల్లి తదితర మార్గాల్లో కల్వర్టులు కూలి ఐదేళ్లు గడుస్తుంది. అయినప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ కనీస మరమ్మతులు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి మరమ్మతులు చేయించాలి.
>
> – నర్సింలు, రొంపల్లి

అవినీతి డీలర్‌ను కొనసాగించొద్దు

తహశీల్దార్‌కు అచ్యుతాపూర్ గ్రామస్తుల వినతి



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న అచ్యుతాపూర్ గ్రామస్తులు

యాలాల: పదేళ్లగా బియ్యం పంపిణీలో అవినీతికి పాల్పడ్డ డీలర్‌ను కొనసాగించొద్దని అచ్యుతాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అచ్యుతాపూర్ డీలరు కౌసల్య, తన భర్త బాబుతో కలిసి బియ్యం సరఫరా సక్రమంగా చేయడం లేదని ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలో ఇద్దరు ఆర్ఐలు, తహసీల్దార్ నిర్వహించిన విచారణలో డీలరు అక్రమాలను గ్రామస్తులు ఏకరవు పెట్టారని గుర్తు చేశారు. వివాహమైన సభ్యుల, స్థానికంగా లేని వారి బియ్యం కోటాను దుర్వినియోగం చేశాడన్నారు. ఈ విషయాలపై సస్పెండ్ చేసినప్పటికీ, తిరిగి కోర్టు ద్వారా స్టే ఆర్డరు తెచ్చుకున్నాడన్నారు. అయినప్పటికీ వారిని డీలరుగా అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి కొత్త డీలరు నియామకం చేపట్టాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి



నూతన తహశీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలని కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం చౌడాపూర్ మండల నూతన తహశీల్దార్‌గా వాహిదా ఖాతుం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశోక్‌కుమార్ మాట్లాడుతూ..అధికారులు నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న ప్రజోపయోగ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో అధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్స్ సలీం, వెంకటయ్య గౌడ్, యువజన కాంగ్రె మండల అధ్యక్షుడు రాము, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్, స్థానిక నాయకులు యాదయ్య, సంటి యాదయ్య, తొంబ చిన్నయ్య, మన్యం గోపాల్, శ్రీను, రమేశ్, శ్రీశైలం, మణికంఠ, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వెలకట్టలేనివి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మెహరున్నిసా బేగం



ఉద్యోగ విరమణ పొందుతున్న సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు, సహచరులు

కుల్కచర్ల: చిన్నారులు, బాలింతలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మెహరున్నిసా బేగం పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలంలో వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మెహరున్నిసా బేగం మాట్లాడుతూ..చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయడంలో సిబ్బంది ఎంతో చురుకుగా పని చేస్తున్నారన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ తీసుకుంటున్న సిబ్బందిని కొనియాడారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు వీరమణి, నర్సమ్మ, అంబాబాయి, లలితాబాయిలతో పాటుగా ఆయాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజిలయ్య, యాదయ్య, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

అన్నదాతలకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

బషీరాబాద్: వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. శనివారం నావంద్గీ రైతు వేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. అన్నదాతలు మేలైన విత్తనాలు వాడడంతో పాటు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రతీ రైతు వేసవిలోనే భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. పొలాల్లో పోషక ఎరువులు వినియోగించి, వరిలో నత్రజని శాతాన్ని తగ్గిస్తే అధిక దిగుబడులు వస్తాయని శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి అనిత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్, సురాయిపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులతో పాటు చెట్ల కొమ్మలు తొలగించేక్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ తెలిపారు.

దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

తాండూరు రూరల్: దళితుడిపై దాడి చేసిన అగ్రకుల పెత్తందార్లను వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాండూరు మండలం బెల్కటూర్ గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ ఈ నెల 18వ తేదీన తన పెళ్లి సందర్భంగా హనుమాన్ దేవాలయం నుంచి ఊరేగింపుగా ఇంటికి వెళ్తున్నాక్రమంలో అదే గ్రామానికి చెందిన మద్దూరు అశోక్, చరణ్, ప్రవీణ్, ఈడ్గి శివకుమార్ అతనిపై దాడి చేశారని తెలిపారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇంకా దళితులపై వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పింఛన్ కంసాన్‌పల్లిలోనే ఇప్పించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: పింఛన్ తీసుకోవాలంటే ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, దీంతో వృద్ధులు, వితంతువులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారని పలువురు పేర్కొన్నారు. మా గ్రామంలోనే పింఛన్ ఇప్పించండి సారూ అంటూ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామస్తులు శనివారం ఎంపీడీఓ బన్సిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కంసాన్‌పల్లి గ్రామానికి పోస్టాఫీసు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామంలో ఉందని, పెన్షన్‌దారులు ప్రతి నెల ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామానికి వెళ్లి పెన్షన్ తీసుకునే పరిస్థితి నెలకొందని తెలిపారు. సంవత్సరాల తరబడి ఈ పెన్షన్ కష్టాలు తప్పడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మా పింఛన్ మా గ్రామంలోనే ఇప్పించండి సారూ అని వేడుకున్నారు. తక్షణమే స్పందించిన ఎంపీడీఓ మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో వృద్ధులు, వితంతువులు, గ్రామస్తులు ఉన్నారు.

ఉద్యోగులను గుర్తుంచుకునేలా పనిచేయాలి

కొత్తూరు: ప్రభుత్వ ఉద్యోగులు తాము విధులు నిర్వహించే చోట తమ సేవలను ప్రజలు గుర్తుంచుకునేలా పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సన్మాన సభలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన వనం రాంచందర్‌రావును ఆమెతో పాటు సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులకు పదవి విరమణ సహజమన్నారు. కానీ విధులు నిర్వహించే ప్రతీ చోట ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, సోమ్లనాయక్, మాదారం నర్సింలుగౌడ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, జనార్ధన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



మీ సేవలో దరఖాస్తులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

దుద్యాల్: 190 రేషన్ కార్డుల దరఖాస్తులను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. కొంతం కాలంగా పెండింగ్‌లో ఉంచడంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన సాక్షి శుక్రవారం ఎన్నాళ్లీ ఎదురుచూపు అనే శీర్షికతో కథనం ప్రచురితం చేశారు. ఈ విషయంలో స్పందించిన రెవెన్యూ అధికారులు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ముందడుగు వేశారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు మాట్లాడుతూ పాత రేషన్ కార్డుల్లో కొత్త మెంబర్లను నమోదు చేసుకునేవి మాత్రమే పరిశీలించి వాటిని వివిధ మండలాలకు పంపినట్లు తెలిపారు. దుద్యాల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో మార్పులు చేర్పులకు అవకాశం లేకపోవడంతో పాత మండలాలకు పంపించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దౌల్తాబాద్‌కు 52, బొంరాస్‌పేట్‌కు 126, కొడంగల్ 12 తహసీల్దార్ కార్యాలయాలకు పంపినట్లు ఆయన వివరించారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్



శెట్టిరవిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు

బషీరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరని డీఆర్‌డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీఓ శెట్టిరవికి వీడ్కోలు సమావేశం తాండూరు పట్టణంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి కార్యాలయం నుంచి అధికారులు సిబ్బంది పాల్గొని శెట్టిరవి, భాగ్యశ్రీ దంపతులను శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపీడీఓగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి ఫైనాన్స్ అధికారిగా ఉద్యోగానికి వన్నెతెచ్చేల పనిచేశారని కొనియాడారు. ఆర్‌బీఎల్ఓ సీతఊ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. తాండూరు, బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, బషీరాబాద్ యాలాల పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రామ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అజయ్‌ప్రసాద్, సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, తాండూరు, పెద్దేముల్ ఎంపీడీఓలు విశ్వప్రసాద్, రతన్‌సింగ్, బషీరాబాద్ ఎంపీఓ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, వారి బంధువులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పొడిగించేందుకు కృషి



మోమిన్‌పేటలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మహేందర్‌రెడ్డి

మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పొడిగించేందుకు కృషి చేస్తానని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 31తో మూసివేస్తారని మార్క్‌ఫెడ్ ఆదేశాలను సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అవసరమైతే ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన వివరించారు. మోమిన్‌పేటలో కొనుగోలు చేస్తున్న జొన్నలు నవాబ్‌పేట, బంటార్వం, శంకర్‌పల్లి మండలాల నుంచి రైతులు పెద్ద మొత్తంలో తీసుకువస్తున్నారని ఆయన గుర్తు చేశారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని 15 రోజులు కొనుగోలు కేంద్రాన్ని పొడిగించాలని కోరారు.

ఎల్ఓసీ అందజేత: ఎన్కేపల్లి గ్రామానికి చెందిన మంగలి పవన్‌కు రూ.2.50లక్షలు, టేకులపల్లికి చెందిన ఇబ్రహీంకు రూ.90వేలు మంజూరైన ఎల్ఓసీని బాధిత కుటుంభీకులకు అందజేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సురేందర్, మహంత్ స్వామి, సిరాజొద్దీన్, ఎజాస్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



నాగారంలో తూకం వేసిన ధాన్యం సంచుల్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధారూరు: వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ధారూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మోమిన్ కలాన్, నాగారం, తరిగోపులలో వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పండించిన ధాన్యాన్ని నిర్ణీత తేమశాతం అంటూ కొర్రీలు పెట్టకుండా 25 శాతం తేమ ఉన్నా, అదనంగా రెండు కిలోల బాజు తీయకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మోమిన్‌కలాన్‌లో 60 మంది రైతులు వడ్లను ఆర బెడుతున్నా వానలకు తేమశాతం 17 కూడా రావడం లేదన్నారు. నాగారం కేంద్రంలో 35 లారీలకు సరిపడ ధాన్యం సంచులు ఉన్నా లారీల కొరతతో ధాన్యం తరలింపు ఆలస్యమవుతుందని, రైతుల అకౌంట్లలో సకాలంలో డబ్బులు జమకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలను సందర్శించిన వారిలో సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు శశాంక్, రాములు, బాల్‌రాజ్‌నాయక్, భీంసేన్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

జీలుగ, జనుము విత్తనాలు సరఫరా చేయాలి

మండలంలోని 7 వ్యవసాయ క్లస్టర్లకు కేవలం 49 క్వింటాళ్ల జీలుగ సరఫరా చేశారని, అవీ ఒక్క క్లస్టర్‌కే సరిపోవని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. జనుము విత్తనాలు అసలే రాలేదని, వెంటనే అవసరమైన విత్తనాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



అనంతగిరి: నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతగిరి: హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు మహారాష్ట్రలోని హోల్కర్ రాజవంశానికి చెందిన మహారాణి అహల్యాబాయి విశేష కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు.శనివారం వికారాబాద్‌లోని గ్రంథాలయంలో ఆమె జయంతిని ఉత్సవాల కన్వీనర్ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, నాయకులు నందు, అమర్‌నాథ్, వెంకట్, అశోక్, మాధవి, సుధాకర్ ఆచారి, రాఘవేందర్,మైపాల్,విక్రం పాల్గొన్నారు.

అహల్యాబాయి జీవితం అందరికీ ఆదర్శం

శంకర్‌పల్లి: స్త్రీ జాతి మనుగడ కోసం నిరంతరం శ్రమించిన ధీర వనిత అహల్యాబాయి హోల్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పట్టణ సామాజిక సమరసత సంస్థ నాయకులు స్పష్టం చేశారు. అహల్యాబాయి త్రిశతాబ్ది జయంతిని శనివారం శంకర్‌పల్లిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు విద్యార్థులకు పోటీ పరీక్షలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదా నం చేశారు. నరేందర్, చంద్రమౌళి, సంస్థ సభ్యులు దామోదర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కాశీనాథ్, దయాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.